అపారిశుద్ధ్యంతో అవస్థలు

- రోడ్డు మీద ప్రవహిస్తున్న మురుగు నీరు
- పూడికలు తీయకపోవటమే కారణమంటున్న స్థానికులు

పాయకరావుపేట: మండలంలో గల గ్రామాల్లో పారిశుధ్య లోపం నెలకొనడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శ్రీరాంపురం, కుమారపురం, నామవరం, గుంటపల్లి, పాల్మన్‌పేట, పాల్తేరు తదితర గ్రామాల్లో మురుగు నీరు బయటికి వెళ్లే మార్గం లేకపోవడం వల్ల ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల స్థాయి అధికారులు ప్రతినిత్యం గ్రామాలు పర్యటిస్తున్నప్పటికీ పారిశుధ్య లోపం మాత్రం యథా ప్రకారంగానే కొనసాగుతోంది. మండలంలో గల కుమారపురం గ్రామంలో డ్రైనేజీల పూడికతీత తీయకపోవడం కారణంగా మురుగు నీరు, వర్షం నీరు కలిసి రోడ్డుపై ప్రవహిస్తోంది. గ్రామస్తులు పలుమార్లు సచివాలయానికి ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేదని పలువురు వాపోతున్నారు. అదే విధంగా శ్రీరాంపురం, ఎస్.నర్సాపురం రోడ్డులో పాఠశాల వద్ద చెత్త వేయడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో చెత్తను పాఠశాలల సమీపంలోనే రోడ్డుకి ఇరువైపులా వేయడం వల్ల దుర్వాసన కూడా వస్తుందని చెబుతున్నారు. అదే విధంగా పాల్మన్‌పేట, నామవరం, గుంటపల్లి గ్రామాల పరిధిలో రోడ్డు పైన చెత్తకుప్పలు వేయడం వల్ల ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గ్రామాల అభివృద్ధి, పరిశుభ్రతే ధ్యేయంగా స్వచ్ఛతాహీ సేవా, స్వచ్ఛభారత్ పేరిట అధికారులు ప్రచారాల వరకే పరిమితం అవుతున్నారు గానీ, ఆచరణలో అది కనిపించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్య లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


శ్రీరాంపురం-ఎస్.నర్సాపురం రోడ్డులో పాఠశాల సమీపాన పేరుకుపోయిన చెత్త


కుమారపురంలో రహదారిపై ప్రవహిస్తున్న డ్రైనేజీ మురుగు

ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు..



కుమారపురం గ్రామంలో డ్రైనేజీ నీరు రోడ్డు పైనే ప్రవహిస్తోంది. పూడికతీత తీయడం లేదు. సచివాలయ అధికారులకు ఎన్నోసార్లు ఫిర్యాదు చేశాం. అయినా ఫలితం లేదు. గ్రామంలో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. మురుగు నీటి దుర్వాసనతో ఎంతో ఇబ్బందిగా వుంది.

– నీలాపు వెంకటరెడ్డి, కుమారపురం

సమస్యలు పరిష్కరిస్తాం..



కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో పారిశుధ్య లోపం లేకుండా సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తాం. కొన్ని పారిశుధ్య సమస్యలు మా దృష్టికి వచ్చాయి. వాటిని తక్షణమే పరిష్కరించి ప్రజలకు అపారిశుధ్య సమస్య లేకుండా చూస్తాం

– సీహెచ్ చంద్రశేఖర్, ఈవోఆర్డీ, పాయకరావుపేట

క్లుప్తంగా

అయ్యప్ప స్వామికి మహా పడి పూజ


అయ్యప్ప స్వామికి పడి పూజ చేస్తున్న భక్తులు

యలమంచిలి రూరల్: అయ్యప్ప స్వామి ఆలయంలో స్వాములు మహాపడి పూజ వైభవంగా నిర్వహించారు. పట్టణం, పరిసర గ్రామాలకు చెందిన పలువురు కన్నెస్వాములు, అయ్యప్ప మాలధారులు భక్తిశ్రద్ధలతో పూజలో పాల్గొన్నారు. గురుస్వామి మంచిరాజు గణేశ్వరరావు, అర్చకుడు మేకా భగవాన్ శర్మ, వడ్లమాని ప్రసాద్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన పడిపూజలో భాగంగా స్వామికి అభిషేకం, అష్టోత్తరం, మణికంట పూజలు చేశారు. చేసిన తర్వాత స్వామిని స్మరిస్తూ భజన కీర్తనలతో పాటలు పాడారు.ప్రతి ఏటా నవంబరు 16వ తేదీ రాత్రి ఈ విధంగా ప్రత్యేక మహాపడి పూజ నిర్వహిస్తున్నట్టు గురుస్వామి గణేష్ చెప్పారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను భక్తులు స్వీకరించారు.

గృహ ప్రవేశ వేడుకల్లో పాల్గొన్న కంబాల


కంబాల జోగులుతో వైఎస్సార్‌సీపీ నాయకులు

పాయకరావుపేట: మండలంలో గల పెంటకోట గ్రామ సర్పంచ్ చేపల నాగమణి తాతాజీ నూతన గృహ ప్రవేశానికి పాయకరావుపేట ఇన్‌చార్జి కంబాల జోగులు హాజరయ్యారు. నాగమణి తాతాజీ దంపతులను ఆత్మీయంగా పలకరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, జెడ్పీటీసీ సభ్యుడు లంక సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, సర్పంచ్‌లు కోడ కోటేశ్వరరావు, గెడ్డమూరి నీలవేణి శ్రీనివాసరావు, వంగలపూడి సరస్వతీ రామారావు, నాయకులు దేవవరపు వెంకటేశ్వరరావు, దేపల దేవుడు, చోడిపిల్లి శ్రీనివాస్, చిక్కాల ఉపసర్పంచ్‌లు చిక్కాల బాబు, జగతా భవానీ శ్రీనివాస్, యజ్జల సత్యనారాయణ, పల్లేల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల ముప్పు నుంచి పెద్దలే పిల్లల్ని కాపాడాలి


జెండా ఊపి 2కే రన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

అచ్యుతాపురం: మాదక ద్రవ్యాల జోలికి పిల్లలు వెళ్లకుండా పెద్దలు జాగ్రత్తలు తీసుకోవాలని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. అచ్యుతాపురం ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో ఆదివారం మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలను వివరిస్తూ నిర్వహించిన 2కే, 5కే రన్‌లను ప్రారంభించారు. అధికారులు గంజాయిపై ఉక్కుపాదం మోపాలని కోరారు. నియోజకవర్గంలో డీహైడ్రేషన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నమ్మి గణేశ్, ఎస్ఐ సుధాకర్, కళాశాల కరస్పాండెంట్ ప్రసాద్, శ్రీనివాసరావు, నర్సింగరావు, పవన్, విజయ్, బాబ్జి, విమలనాయుడు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్డుదారులకు కందిపప్పు అందజేత


వినియోగదారులకు కందిపప్పు అందజేస్తున్న దృశ్యం

అనకాపల్లి: పట్టణ పరిధిలో 10, 17 రేషన్ దుకాణాల్లో ఆయా ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వ ఆదేశాల మేరకు బియ్యంతో పాటు, కందిపప్పు, పంచదార రేషన్ కార్డు వినియోగదారులకు అందజేసినట్లు పౌర సరఫరాల శాఖ అనకాపల్లి డిప్యూటీ తహసీల్దార్ టి.లీలా శేషు కుమారి ఆదివారం తెలిపారు. పైరెండు డిపోల రేషన్ కార్డుదారులకు కందిపప్పు ఇవ్వడం లేదని వచ్చిన సమాచారం మేరకు అక్కడ కందిపప్పు లేకపోవడంతో గొడౌన్ నుంచి తీసుకొచ్చి ఇచ్చినట్లు తెలిపారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు


విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న తోట నగేష్


చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో ఉద్యమకారులకు నివాళులర్పిస్తున్న దృశ్యం

పాయకరావుపేట: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ తోట నగేష్ అన్నారు. పట్టణంలో గల శాఖా గ్రంథాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. పుస్తక ప్రదర్శన వల్ల గ్రంథాలయాల్లో మరుగున ఉండే పుస్తకాలు కూడా పాఠకులు చూసే అవకాశం కలుగుతుందన్నారు. విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా సంగీత విభావరి ఏర్పాటు చేసిన ఆర్‌వీ రత్న మాస్టారు, గ్రంథాలయ కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. పంచాయతీ వార్డు సభ్యురాలు పెదిరెడ్డి సత్యవతి, ఇంగ్లీషు లెక్చరర్, విశ్రాంత ఉపాధ్యాయులు ఎస్.సీతారామయ్య, తేజోమూర్తుల వెంకటేష్, అచ్యుతరావు, రామచంద్రరావు, షేక్ సలీం, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళి..

నక్కపల్లి: చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమానికి కృషి చేసిన అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం, ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం కవిత, గ్రంథాలయాధికారి జనార్దన్ మాట్లాడుతూ ఉద్యమకారుల పోరాటాల వల్లే గ్రంథాలయాలు ఆవిర్భవించాయని తెలిపారు. గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనం చేయడం అలవాటు చేసుకోవాలన్నారు.


కోటవురట్ల శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

కోటవురట్ల గ్రంథాలయంలో..

కోటవురట్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయాధికారి అప్పలనాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులతో స్టోరీ టెల్లింగ్, బుక్ రీడింగ్ చేయించారు. వక్తలు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన సముపార్జనకు సోపానాలన్నారు. ఉపాధ్యాయులు జె.వి.ప్రసాదరావు, జె.నరసింగరావు, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలి


ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందజేస్తున్న నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు

మునగపాక: ప్రతి ఒక్కరూ కలియుగ దైవం శ్రీనివాసుని ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. మునగపాకకు చెందిన వేగి రామారావు కుమారుడు నాగేశ్వరరావు రూ.లక్ష విరాళాన్ని ఆదివారం కమిటీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ రూ.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కాండ్రేగుల జగ్గారావు, పెంటకోట ఉమేష్, వేగి కృష్ణ, సూరిశెట్టి రాము, ఆడారి సూర్యచంద్రరావు, ఆడారి కాశీబాబు, పెంటకోట జగ్గు, పెంటకోట శ్రీనివాసరావు, బొడ్డేడ భరణి పాల్గొన్నారు.

20 నుంచి వేంకటేశ్వరుని కల్యాణ మహోత్సవాలు


గోడపత్రిక విడుదల చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

ఎస్.రాయవరం: గురజాడ జన్మస్థలం అయిన మండల కేంద్రం ఎస్.రాయవరంలో శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి దివ్య లీలా కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ నిర్మాణం తర్వాత తొమ్మిదేళ్లుగా స్వామికి అంగరంగ వైభవంగా ప్రతి ఏడాది కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.ఈ మేరకు ఆదివారం గోడపత్రిక విడుదల చేశారు. ఈ నెల 20 నుంచి 23 వరకు స్వామివారి కల్యాణ మహోత్సవాలు నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, ఎంపీటీసీ సభ్యుడు బైపా శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ సభ్యులు యల్లపు నాగు, బంగారి తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పని చేసే వారికి తగిన గుర్తింపు

మునగపాక: పార్టీలో కష్టపడి పని చేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. మునగపాకలో ఆదివారం ఇటీవల పదవులు పొందిన నాగేశ్వరరావుతో పాటు గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణంలను ఘనంగా సత్కరించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీ నేతలు దాడి ముసిలినాయుడు, వెలగా మురళి, దాడి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



డ్యాన్సులు వేస్తున్న విద్యార్థులు



శక్తి అవతారంలో విద్యార్థులు

పాయకరావుపేట: శ్రీ ప్రకాష్ కళాశాల విద్యార్థులు స్పైస్ (శ్రీ ప్రకాష్ ఇంటర్ క్రియేటివ్ ఎనర్జీస్) ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు ఉదయం నుండి సాయంత్రం వరకు ఆటపాటలతో అలరించారు. విద్యార్థులు తమ దైనందిన కార్యక్రమాలకు భిన్నంగా ఒకరోజు పూర్తిగా ఆటపాటలతో గడపాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భానుమూర్తి తెలిపారు. శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిసలు కావద్దు

యలమంచిలి రూరల్: విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దని యలమంచిలి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ తేజ, పట్టణ ఎస్ఐ సావిత్రి సూచించారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధి కొక్కిరాపల్లిలో గ్రామజ్యోతి సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి హాజరై మాట్లాడుతూ విద్యార్థి దశలో చదువుపై మాత్రమే దృష్టి సారించాలన్నారు. మత్తు పదార్థాల జోలికి పోకుండా సన్మార్గంలో నడుచుకుని భావితరాలకు మార్గదర్శులుగా ఉండాలన్నారు. గ్రామజ్యోతి సంఘం తరపున విద్యార్థులు పెడత్రోవ పట్టకుండా సామాజిక కార్యక్రమాలు నిర్వహించేలా ప్రోత్సహిస్తున్న నిర్వాహకులు మజ్జి వీరబాబు, మజ్జి రామకృష్ణ తదితరులను వారు అభినందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద గొర్లె నానాజీ, విశ్రాంత ఉద్యోగులు భైరవభట్ల శివరాం, షేక్ అబ్దుల్లా, ప్రవాస భారతీయుడు మజ్జి శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


కొక్కిరాపల్లిలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న పట్టణ ఎస్ఐ సావిత్రి

శ్రీనివాసుని ఆలయాభివృద్ధికి కృషి

మునగపాక: శ్రీనివాసుని ఆలయ నిర్మాణానికి సహకరిస్తానని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. ఆదివారం మునగపాక వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఆయనను కలిసి సహకరించాలని కోరారు. ఇందుకు స్పందించిన ఆయన వేంకటేశ్వర స్వామి అంటే తనకు ఎంతో ఇష్టమని, స్వామి వారి ఆలయ నిర్మాణం వేగవంతమయ్యేలా చూడాలన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జనసేన మండల పార్టీ అధ్యక్షుడు టెక్కలి పరశురామ్, కమిటీ సభ్యులు బద్దెం సూర్యనారాయణ, దాడి ముసిలినాయుడు, మొల్లేటి సత్యనారాయణ, సూరిశెట్టి రాము, పెంటకోట ఉమేష్, వెలగా శ్రీనివాసరావు, ఆడారి లక్ష్మణరావు, ఆడారి కృష్ణ, విల్లూరి నూకనరసింగరావు తదితరులు ఉన్నారు.

రైతు, కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా 26న నిరసన


మాట్లాడుతున్న కర్రి అప్పారావు

అనకాపల్లి: రైతు, కార్మిక చట్టాలను కాలరాస్తున్న మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనెల 26న దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రైతు కిసాన్‌మోర్చా జాయింట్ యాక్షన్ జిల్లా కార్యదర్శి కర్రి అప్పారావు తెలిపారు. స్థానిక కోడుగంటి గోవిందరావు భవనంలో రైతు కిసాన్‌మోర్చా, ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18 నుంచి గ్రామాల్లో మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలపై అవగాహన కార్యక్రమాలు కల్పిస్తు 26న దేశవ్యాప్త నిరసన చేస్తున్నట్లు తెలిపారు. రైతులు, కార్మికులు, కూలీలు అందరూ పెద్ద ఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం కొత్తగా తీసుకురానున్న చట్టలను తక్షణమే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గాడి బాలు, వై.ఎస్.భద్రం, శంకరరావు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

అణుకులో తారురోడ్డు నిర్మించాలి


అణుకులో తారురోడ్డు కోసం నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు, ప్రజలు

కోటవురట్ల: అణుకు గిరిజన గ్రామానికి తారురోడ్డు నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం సమావేశం నిర్వహించి జెండా ఆవిష్కరించారు. అనంతరం గిరిజనులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అప్పలరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గిరిజనుల పోరాటంతో రూ.32 లక్షలతో మెటల్ రోడ్డు వేశారన్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో ఆ రోడ్డు కోతకు గురై అక్కడక్కడ కొట్టుకుపోయిందని, మళ్లీ గిరిజనులకు ఇక్కట్లు తప్పడం లేదన్నారు.
వైద్య సేవలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. నియోజకవర్గంలో అభివృద్ధికి నోచని గిరిజన గ్రామంగా అణుకు మిగిలిపోయిందని, హోం మంత్రి అనిత స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధానంగా గ్రామానికి తారురోడ్డు నిర్మించి గిరిజనుల దీర్ఘకాలిక సమస్యలకు ముగింపు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.సత్యనారాయణ, జి.డేవిడ్‌రాజ్, ఎం.రాజేష్, సన్యాసిరావు, సూరిబాబు, రాజు, బాబు, రమేష్, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల పంపిణీ


మోసయ్యపేటలో తాము పొందిన సర్టిఫికెట్లు చూపిస్తున్న విద్యార్థులు


మంగళవరపుపేటలో బహుమతులతో చిన్నారులు

అచ్యుతాపురం: బాలల దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీల విజేతలకు ఆదివారం అచ్యుతాపురం మండలం మోసయ్యపేటలో సర్పంచ్ పంచదార్ల పైడిరాజు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మారిసెట్టి వెంకట అప్పారావు మాట్లాడుతూ నెహ్రూకు పిల్లలంటే ఎంతో ఇష్టమని, అందుకే ఆయన జన్మదినం రోజున బాలల దినోత్సవం నిర్వహించుకోవడంతో పాటు, పిల్లలకు ఎంతో ఇష్టమైన ఆటల పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. ఆర్.లక్ష్మి, చొప్పా అప్పలనాయుడు, శర్మ, సతీష్, పార్వతి, సిరి, వనజ, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూ ఆశయ సాధనకు పాటుపడాలి..

మునగపాక: ప్రతి ఒక్కరూ నెహ్రూ ఆశయ సాధనకు పాటు పడాలని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఏవీఎస్ మూర్తి తెలిపారు. నెహ్రూ జయంతి కార్యక్రమంలో భాగంగా మండలంలోని మంగళవరపుపేటలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముందుగా నెహ్రూ చిత్రపటం వద్ద పలువురు నివాళులర్పించారు. నెహ్రూ జీవితం నేటి తరానికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటాల పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు.

చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న దేముడునాయుడు

రాంబిల్లి (యలమంచిలి): ఈనెల 26న దేశవ్యాప్తంగా కార్మికులు, రైతు సమస్యలపై కలెక్టర్ కార్యాలయాల వద్ద పెద్ద ఎత్తున ఆందోళనలు జరుగుతాయని, ఆ కార్యక్రమాల్లో కార్మికులు, రైతులు పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడు జి. దేముడునాయుడు కోరారు. ఆదివారం రాంబిల్లి మండల కేంద్రంలో కార్మికుల, రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 26న జరగబోయే ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇచ్చేలా చూడాలని, కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని, పరిశ్రమలలో స్థానికులకు ఉపాధి కల్పించాలని, అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం, వీవోఏలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలనే పలు డిమాండ్ల సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ చందక రామకృష్ణ, పిల్లి మంగ, లక్ష్మి, కొండయ్య, అప్పారావు, కర్రి శ్రీను, నాగేష్, వి. వరహాలరావు తదితరులు పాల్గొన్నారు.

పోతురెడ్డిపాలెంలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న యువకుడు

యలమంచిలి రూరల్: సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో మండలంలోని పోతురెడ్డిపాలెం, రుక్మిణీపురం గ్రామాల్లో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఇత్తంశెట్టి సన్యాసినాయుడు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. సత్యసాయి బాబా 99వ జన్మదిన వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 40 మంది యువకులు రక్తదానం చేశారు. వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పలువురు సత్యసాయి సేవా సమితి కన్వీనర్లు, జిల్లా పదాధికారులు పాల్గొన్నారు.

సందడిగా వనభోజనాలు


రేవుపోలవరం తీరం కొండపై సెల్ఫీలు దిగుతున్న యువతీ యువకులు


వేమగిరిలో వన భోజనాల వద్ద నెలకొన్న సందడి వాతావరణం

ఎస్.రాయవరం: మండలంలో కార్తీకమాస వనభోజనాలు ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగాయి. వేమగిరి శ్రీరంగనాయకులు పర్వత ప్రాంతంలో జరిగిన వన భోజనాల్లో సుమారు 4 వేలకు పైగా భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. శ్రీ రంగనాయకులను దర్శించుకున్నారు.

రేవుపోలవరం తీరంలో..

రేవుపోలవరం తీరంలో పర్యాటకులు సందడి చేశారు. శ్రీ లక్ష్మీమాధవ స్వామి పర్వతం పైకి ఎక్కి సెల్ఫీలు దిగి ఆనందించారు. నిర్మాణ దశలో ఉన్న మినీ కైలాసగిరీ గౌరీ పార్వతి విగ్రహాల వద్ద గడిపారు.

వమ్మవరంలో సప్తాహం..

వమ్మవరం శ్రీ స్వయంభు వేంకటేశ్వరస్వామి ఆలయంలో చేపట్టిన సప్తాహం ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగింది. వారం రోజులుగా గ్రామంలో నిర్విరామంగా భక్తులు హరిభజనలు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం: కొరుప్రోలు సబ్‌స్టేషన్ పరిధిలో వమ్మవరం ఫీడర్, గెడ్డపాలెం, గుడివాడ గ్రామాలకు సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. హెచ్‌టీ లైన్ పనుల్లో భాగంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.